క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

పెనమలూరు: ఇంటర్మీడియెట్ ఫలితాలలో మార్కులు తగ్గాయని విద్యార్థి అదృశ్యం అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిశోర్‌బాబు వివరాలు తెలుపుతూ తాడిగడప శ్రీనగర్ కాలువ కట్టకు చెందిన కె.రేవంత్ ఇంటర్‌పరీక్ష రాశాడు. పరీక్ష ఫలితాల్లో అతనికి మార్కులు తగ్గటంతో శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. దీంతో అతని తల్లి అనంతలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కంకిపాడు: వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ పి.సాయినికిత, కోలవెన్ను ఎంపీటీసీ సభ్యురాలు తోకల ఉమాదేవి అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ శిబిరంలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేశారు. 98 మంది వృద్ధులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైద్య సేవలను అమలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవలను వినియోగించుకుని ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సరళ, పద్మావతి, ఎం.శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, మానస, రజిని, మెర్సీ పాల్గొన్నారు.

ప్రతి నెలా సామూహిక వ్రతాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి నెలా సామూహిక వ్రతాలు నిర్వహించ తలపెట్టినట్లు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ శుక్రవారం తెలిపారు. ప్రతి నెలా దేవస్థానంలో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం, శ్రీ వెంకటేశ్వర స్వామి వ్రతం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా తొలుత వచ్చే నెల 1వ తేదీన సత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతుందని వివరించారు. ఈ సామూహిక వ్రతాల్లో పాల్గొనే భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని తమ సొంతఖర్చులతో అందిస్తామని కాకాని దంపతులు తెలిపారు. వ్రతాల్లో పాల్గొనేందుకు భక్తులు రెండు రోజులు ముందుగా తమ పేరు, గోత్ర నామాలను దేవస్థానం కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని సూచించారు.

మానవ హక్కుల కమిషన్ పెనమలూరు కన్వీనర్‌గా పిచ్చయ్య



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ కన్వీనర్‌గా సంగెపు పిచ్చయ్య నియమితులయ్యారు. దీనికి సంబంధించి వివరాలు శుక్రవారం ఆయన తెలిపారు. విజయవాడలో గురువారం జరిగిన సమావేశంలో నియోజకవర్గాల కన్వీనర్‌ల నియామకం జరిగిందన్నారు. ఇందులో భాగంగా తనను పెనమలూరు కన్వీనర్‌గా నియమిస్తూ ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది రంగసాయిరెడ్డి నియామక పత్రం అందజేశారన్నారు. మానవ హక్కుల సంరక్షణకు తన వంతు కృషి చేస్తానని పిచ్చయ్య తెలిపారు.

జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో చలివేంద్రం



హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయటం హర్షణీయమని హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి అన్నారు. జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో స్థానిక విజయవాడ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పుర ప్రముఖులు మారుబోయిన కోటేశ్వరరావు, సుంకర సుభాష్‌చంద్రబోస్, నండూరి సత్య వెంకటేశ్వర శర్మ, జమాతే ఇస్లామీ హింద్ హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు షేక్ నసీర్, మహిళా విభాగం అధ్యక్షురాలు షేక్ అఫ్సర్, అబ్దుల్ అలీం పాల్గొన్నారు.

భవిష్యత్తుకు నవోదయం

- నేడు నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష
- ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న 3,032 మంది విద్యార్థులు
- 22 పరీక్ష కేంద్రాల ఏర్పాటు



నవోదయ ఎంపిక పరీక్ష నిర్వహించనున్న ఉయ్యూరు జెడ్పీ పాఠశాల

కంకిపాడు: జవహర్ నవోదయ (వేలేరు) విద్యాలయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సన్నాహాలు పూర్తయ్యాయి. ప్రవేశ పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖ పూర్తి చేసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 29న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

3,032 మంది అభ్యర్థులు..

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 3,032 మంది విద్యార్థులు జవహర్ నవోదయలో ఆరోతరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్నారు. విద్యార్థుల ఎంపిక నిమిత్తం ఈనెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కృష్ణాజిల్లాలో 10, ఎన్టీఆర్ జిల్లాలో 9, ఏలూరు జిల్లాలో 3 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. కృష్ణాజిల్లాలో 1489 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 1052 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 491 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ఆయా కేంద్రాల్లో 29 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పరీక్ష జరగనుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

ప్రవేశ పరీక్ష నిర్వహణకు విద్యాశాఖ సమర్థంగా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే మార్గదర్శకాలను జారీ చేసింది.

- పరీక్ష సమయానికి ముందుగానే వేసవి రీత్యా విద్యార్థులను తల్లిదండ్రులు అల్పాహారం, తగిన నీరు తీసుకునేలా చూడాలి.
- పరీక్ష కేంద్రానికి అరగంట ముందే రావాలి.
- పరీక్ష కేంద్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగించకూడదు.
- పరీక్ష కేంద్రంలోకి వచ్చిన సిబ్బంది పరీక్ష పూర్తయ్యి బయటకు వెళ్లే వరకూ బయటకు రాకూడదు. పరీక్ష విధులు లేని ఉపాధ్యాయులు సంబంధిత పరీక్ష కేంద్రాల వద్ద ఉండకూడదు.
- ప్రైవేటు వ్యక్తులు కేంద్రాల వద్ద సంచరించకూడదు.
- పరీక్షల నిర్వహణపై వదంతులు ప్రచారం చేస్తే చర్యలు ఉంటాయి.
- పరీక్ష కేంద్రంలో పొరపాట్లు జరిగితే చీఫ్ సూపరింటెండెంట్లు, సెంటర్ లెవల్ అబ్జర్వర్ బాధ్యత వహించాలి.

పరీక్షలను సమర్థంగా నిర్వహించాలి..



జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షను సమర్థంగా నిర్వహించాలి. పరీక్షల నిర్వహణకు ఆయా పరీక్ష కేంద్రాలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, సెంటర్ లెవల్ అబ్జర్వర్‌లకు ఉత్తర్వులను జారీ చేశాం. ప్రశ్నపత్రాలు, వదంతులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగకూడదు. ఎలాంటి పొరపాట్లు లేకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, సెంటర్ లెవల్ పరిశీలకులు పరీక్షలు ప్రశాంతంగా సాగేలా బాధ్యత వహించాలి.

– తాహెరా సుల్తానా, జిల్లా విద్యాశాఖాధికారి, కృష్ణాజిల్లా

జ్వరాలపై సర్వే నిర్వహించండి

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

చిలకలపూడి(మచిలీపట్నం): క్షేత్రస్థాయిలో జ్వరాల బారిన పడిన వారి వివరాలను తెలుసుకునేందుకు సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. ఆమె కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అనుమానిత వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి తగిన మందులు అందజేయాలని సూచించారు. ప్రజల్లో కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వా, తాతలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి కళ్లజోళ్ల పంపిణీ, కంటి శుక్లాల శస్త్రచికిత్సలు చేయించాలని చెప్పారు. పుట్టినబిడ్డ నుంచి అర్హులైన వారందరికీ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రామవరప్పాడు నుంచి గూడవల్లి వరకు పర్యటిస్తూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉందో పరిశీలించారు. నిడమానూరు నుంచి పోరంకి వెళ్లే రోడ్డులో 99 ప్లాట్స్ వద్ద, హైస్కూల్ రోడ్డులో పశువుల పాక వద్ద చెత్తకుప్పలు ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే చెత్త కుప్పలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గూడవల్లిలోని జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద చెత్త తొలగించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో నిడమానూరు– పోరంకి రోడ్డుతో పాటు హైస్కూల్ రోడ్డులో చెత్త కుప్పలను పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ నాథ్ వెంటనే తొలగింప జేశారు. పారిశుద్ధ్య నిర్వహణను పక్కాగా నిర్వహించాలని, జాతీయ రహదారిని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తడి, పొడి చెత్తలను విడివిడిగా సేకరించాలని, ప్రతి ఇంటికీ చెత్త బండ్లు వెళ్లేటట్టు చర్యలు తీసుకోవాలని సూచించారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ తరగతులు

గన్నవరం: మండలంలోని గన్నవరం, దావాజీగూడెం, కేసరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మే 1వ తేదీ నుంచి క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు క్రీడల మండల ఇన్‌చార్జ్ దనియాల నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో కబడ్డీ, ఫెన్సింగ్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దావాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌లో వాలీబాల్, కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం జరిగే ఈ శిక్షణ తరగతుల్లో ఆసక్తి కలిగిన బాలబాలికలు పాల్గొనవలసిందిగా కోరారు. ఇతర సమాచారం కోసం 94907 98909 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు మామిడి చెట్ల ఫలసాయం వేలం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని మోడల్ పారిశ్రామికవాడ ఫేజ్-1లో ఉన్న మామిడి చెట్ల ఫలసాయాన్ని పొందటానికి ఈ నెల 29వ తేదీన బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారామ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మల్లవల్లి పారిశ్రామికవాడలో వేలం పాట జరుగుతుందని చెప్పారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనేందుకు రూ.30 వేల ధరావత్తు డీడీ రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. మామిడి చెట్ల ఫలసాయాన్ని మే 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం డెప్యూటీ జోనల్ మేనేజర్ ఫోన్ నెం.91008 61117ను సంప్రదించాలని కోరారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి సత్కారం

గన్నవరంరూరల్: ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని శుక్రవారం పలువురు సత్కరించారు. మండలంలోని చిన అవుటపల్లికి చెందిన అబ్బూరి హిల్లరి బైపీసీ ఇంటర్ ఫలితాలలో 970 మార్కులు సాధించింది. హిల్లరిని విజయవాడ ఎస్ఆర్ఐ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, సిబ్బంది డీఎస్ రాజు, కె.రాజా, కె.సుధాకర్ రెడ్డి శుక్రవారం గ్రామానికి వచ్చి తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించి అభినందనలు తెలిపారు.

ప్రజల నమ్మకం జగనన్నే



పెనమలూరు: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు జగనన్న అందిస్తున్నారని, ప్రజల నోట మా నమ్మకం నువ్వే జగనన్న అని ప్రజలు ఆనందంతో తెలుపుతున్నారని టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు అన్నారు. తాడిగడప మునిసిపాలిటీ పోరంకిలో శుక్రవారం జగనన్న మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలోనే సంక్షేమ పథకాలు అమలు జరిగాయన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించుకుంటే పేదల సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు జగనన్న మాత్రమే అమలు చేయగలుగుతారని వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ నల్లమోతు జీవన్, ఆకునూరు సుబ్బారావు, గృహసారథులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఆరుగొలను, బొమ్ములూరు, మడిచర్ల సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ హనుమాన్‌జంక్షన్ ఏఈ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. బాపులపాడు మండలంలోని ఆరుగొలను, బొమ్ములూరు, మడిచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యనమలకుదురులో కూడా..

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ శనివారం యనమలకుదురు సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా గ్రామంలో డొంక రోడ్డు, ఇందిరానగర్, అవనిగడ్డ కట్ట, యనమలకుదురు పాత గ్రామం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, స్థానికులు సహకరించాలని కోరారు.

శరవేగంగా సొంత భవన నిర్మాణం

రూ 1.44 కోట్లతో కాటూరు కేడీసీసీబీ బ్రాంచ్ కార్యాలయ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న కాటూరు కేడీసీసీబీ బ్రాంచి భవనం

ఉయ్యూరు: కాటూరులో కేడీసీసీ బ్యాంక్ బ్రాంచి నూతన కార్యాలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నూతన బ్రాంచి నిర్మాణంతో నాలుగు దశాబ్దాల అద్దె భవనం ఇక్కట్లు తీరనున్నాయి. బ్రాంచి పరిధిలో రైతులకు విస్తృత సేవలు అందించే లక్ష్యంతో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవ తీసుకున్నారు. మండలంలోని కాటూరు గ్రామం కేంద్రంగా కేడీసీసీ బ్యాంకు బ్రాంచి కార్యాలయం 37 సంవత్సరాలుగాగా నడుస్తుంది. బ్రాంచి పరిధిలో ఏడు పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీరవల్లి, కాటూరు, బోళ్లపాడు, ముదునూరు, కలవపాముల, ఉంగుటూరు మండలంలోని వేమండ, ఇందుపల్లి సొసైటీలు బ్రాంచి పరిధిలోకి వస్తాయి.

రూ. 107 కోట్ల టర్నోవర్..

కాటూరు కేడీసీసీ బ్రాంచి వార్షిక టర్నోవర్ రూ. 107 కోట్లుగా ఉంది. బ్రాంచితో పాటుగా, బ్రాంచి పరిధిలోని సొసైటీల ద్వారా విద్య, వైద్యం, గృహ, వ్యవసాయం, బంగారు ఆభరణాలు, డ్వాక్రా మహిళలకు విస్తృత స్థాయిలో రుణాలను మంజూరు చేస్తుంది. డ్వాక్రా సంఘాలకు గరిష్టంగా రూ. 20 లక్షలు అందిస్తుంది. రైతు నేస్తం, కర్షక మిత్ర పథకాలతో రైతుల రుణపరపతి పెంచి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుంది.

రూ. 1.44 కోట్లు నిధులు మంజూరు..

అద్దె భవనంలో నడుస్తున్న కేడీసీసీ బ్రాంచి సొంత భవనానికి కేడీసీసీ బ్యాంకు రూ. 1.44 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మొత్తంలో రూ. 46.52 లక్షలతో గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో స్థలాన్ని సేకరించారు. రూ. 97.54 లక్షలు భవన నిర్మాణ పనులను చేపట్టారు. గతేడాది ఆగస్టు నెలలో నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ప్రస్తుతం పనులు సొసైటీ చైర్మన్ గొట్టం శ్రీనివాసరావు పర్యవేక్షణలో తుదిదశకు చేరుకున్నాయి. నూతన బ్రాంచి నిర్మాణ పనులతో అన్ని వసతులు సమకూరుతాయని బ్రాంచ్ మేనేజర్ ఈడే శ్రీకాంత్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్, ఏటీఎం, వంటి అదనపు సౌకర్యాలు అందుబాటులో వస్తాయన్నారు. త్వరలోనే బ్రాంచి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

మంత్రి రోజాకు ఘన స్వాగతం



మంత్రి రోజాకుస్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజాబాబు, చిత్రంలో పేర్ని నాని తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజాకు శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఘనస్వాగతం లభించింది. అతిథిగృహంలో ఆమె పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ పి. జాషువా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, ఎంయూడీఏ చైర్మన్ బొర్రా నాగదుర్గాభవాని, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జోగి రమేష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, కొలుసు పార్థసారథి, వల్లభనేని వంశీ తదితరులు కొద్దిసేపు మంత్రి రోజాతో ముచ్చటించారు.

రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించాల్సిందే



మిల్లర్లు, అధికారులతో సమీక్ష చేస్తున్న ఆర్‌డీఓ విజయ్‌కుమార్

ఉయ్యూరు: ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరను రైతులకు చెల్లించాల్సిందేనని ఉయ్యూరు ఆర్‌డీఓ ఎన్. విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో మిల్లర్లు, తహసీల్దార్‌లతో శుక్రవారం ఆఫ్‌లైన్‌లో తోలిన ధాన్యం సొమ్ముపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో తరలించిన ధాన్యానికి ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేసిందన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా రైతులు ఏ మిల్లుకు ధాన్యం తరలించారో ఆ మిల్లరే ధాన్యం సొమ్ము చెల్లించాల్సి ఉందన్నారు. ఆఫ్‌లైన్ ధాన్యం రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను మిల్లర్లు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మిల్లర్లతో ధాన్యం సొమ్ము ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు. సమావేశంలో డివిజన్‌లోని పలు మండలాల తహసీల్దార్‌లు, మిల్లర్లు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పీసిమ్స్‌లో పెల్విక్ శస్త్ర చికిత్సపై వర్క్‌షాప్

గన్నవరంరూరల్: విజయవాడ ప్రసూతి, గైనకాలజీ సొసైటీ, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ప్రసూతి, గైనకాలజీ , యూరాలజీ, అనాటమీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెల్విక్ శస్త్ర చికిత్సలలో అధిక రక్తస్రావం అయితే అత్యవసరంగా చేయవలసిన విధానంపై ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే వర్క్‌షాప్‌లో ఢిల్లీ నుంచి ప్రత్యేక వైద్య బృందం పాల్గొంటుందని, రాష్ట్రంలోని వైద్య విద్యార్థులు, పీజీలు పాల్గొంటారని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన



భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న మహిళలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం వైశాఖమాసం సందర్భంగా అమ్మవార్లకు విశేష లక్ష పుష్పార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు మహిళలతో ప్రత్యేక పూజలు నిర్వహింపజేసి అమ్మవార్లకు పుష్పార్చన చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి మాట్లాడుతూ లోకకల్యాణార్థం ప్రతి వైశాఖమాసంలో అమ్మవార్లకు ఈ పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు అరెస్టు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాను వీరవల్లి పోలీసులు పట్టుకున్నారు. బాపులపాడు మండలం కోడూరుపాడులో పెద్ద ఎత్తున ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న వీరవల్లి ఎస్ఐ చిరంజీవి గురువారం రాత్రి పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపు లోకి తీసుకోవటంతో పాటుగా, వీరి నుంచి ల్యాప్‌టాప్, రూ.2.05 లక్షల నగదును ఎస్ఐ చిరంజీవి స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పెనమలూరు: తాడిగడప మునిసిపాలటీ యనమలకుదురులో శుక్రవారం జగనన్న చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు కోసూరి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్న చలువ పందిరి, చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా నరేష్‌కుమార్ మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరిగినందున ప్రజల అవసరాలకు చలువ పందిరి వేసి చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ చలివేంద్రాన్ని గ్రామస్తులు ఉపయోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ బాబూరావు, స్థానికులు కమ్మిలి రామారావు, లంకా కోటేశ్వరరావు, కిశోర్, గిరి నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం



సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: మండలంలోని ఉప్పలూరు గ్రామంలో వేంచేసిన శ్రీ సాయిబాబా మందిరం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మందిరం 15వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. సాయినాథుడిని పుష్పాలతో ప్రత్యేకంగా అలకరించారు. తొలుత పండ్ల రసాలు, పుష్పాలతో అభిషేకించారు. పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు చేయించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దుర్గగుడి ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, సొసైటీ చైర్మన్ మాగంటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు లాం సురేష్, వెంగల నాగయ్య, నెరుసు నాని, వెంగల హరి పాల్గొన్నారు.

క్రమశిక్షణగా చదవాలి

గన్నవరంరూరల్: విద్యార్థులు క్రమశిక్షణగా చదివి ఉన్నతంగా ఎదగాలని మాదలవారిగూడెం సర్పంచ్ బుద్దాల లక్ష్మీ ప్రసన్న చెప్పారు. చనుపల్లివారిగూడెంలో శుక్రవారం ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం హెచ్ఎం జెజె.వెంకన్నకుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ఉషా, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ రామచంద్రరావు, ఉపాధ్యాయులు సుధారాణి, గాయత్రి, సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ సింధూర పాల్గొన్నారు.